ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024 | 5

తుని ఏరియా ఆస్పత్రిలో కుప్పకూలిన పైకప్పు - 7లో
» ఘటనా స్థలంలో 12 మంది రోగులు
భైరవపాలెం సముద్రంలో బోటు బోల్తా - 7లో


పోలవరం మట్టి మింగేశారిలా..

'మట్టి'పై మడత పెట్టుడే!

» పోలవరం మట్టి మింగేసిన దొంగలపై ప్రభుత్వం ఆరా
» గడచిన వైసీపీ ఐదేళ్లపాలనలో రూ.100కోట్లకుపైగా మట్టి హాంఫట్
» ఎక్కడికక్కడ తన్నుకుపోయిన అప్పటి ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు
» మట్టి దోచేసిన దొంగలను వదిలేది లేదని తాజాగా హెచ్చరించిన సీఎం చంద్రబాబు
» భవిష్యత్తులో వరదొస్తే అడ్డుకట్టకు మట్టి లేకుండా చేసేశారని ఆగ్రహం
» సీఎం హెచ్చరికల నేపథ్యంలో మరోసారి చర్చనీయాంశంగా మారిన మట్టి దోపిడీ
» ఐదేళ్లపాటు అనుమతుల్లేకుండా అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ అవసరాలకు మట్టి విక్రయాలు
» కొమరగిరి ఇళ్లస్థలాల చదును ముసుగులో రూ.6కోట్లకుపైగా పిండేసిన కాకినాడ కీలక నేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పోలవరం కాలువ మట్టిని ఐదేళ్లపాటు లూటీ చేసిన దొంగలపై కూటమి సర్కారు కన్నెర్ర చేయబోతోంది. కాలువగట్లను బలహీనం చేసి మరీ లూటీ చేసేసిన గద్దలపై చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. తవ్వి తరలించుకుపోయిన తీరుపై త్వరలో విచారణ చేపట్టబోతోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఇటీవల చేసిన హెచ్చరికల నేపథ్యంలో మట్టి దొంగలు, సహకరించిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వీటిని కక్కిస్తామని హెచ్చరించడంతో మరోసారి పోలవరం మట్టి మాఫియా తీరు చర్చనీయాంశంగా మారాయి. అయిదేళ్లపాటు పోలవరం మట్టిన కాజేసిన తీరుపై ఇటీవల సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మట్టి దొంగలపాలు కాకుండా కాపాడితే వైసీపీ పాలనలో మొత్తం దోచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రకంగా చెప్పాలంటే జిల్లాలో జగ్గంపేట నియోజకవర్గం నుంచి తుని నియోజకవర్గం వరకు వైసీపీ నేతలు దోచేసిన పోలవరం మట్టి విలువ రూ.100కోట్లపై మాటే.

కనిపించిందంతా కాజేసేశారు..

జిల్లాలో పోలవరం కాలువ వెంబడి వెళ్తే ఒకప్పుడు మట్టి మేటలు కనిపించేవి. ఓ కొండ తరహాలో మట్టిని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జలవనరులశాఖ పోగేసి ఉంచింది. రియల్ ఎస్టేట్ అవసరాలకు, ఇతర ప్రాజెక్టుల కోసం ఈ మట్టిపై ఎవరు కన్నేసినా అప్పటి ప్రభుత్వం తట్ట మట్టి కూడా కదలనివ్వలేదు.. తీరా అయిదేళ్ల కిందట వైసీపీ అధికారంలోకి రాగానే ఈ మట్టి గుట్టలు కరిగిపోయాయి. అయిదేళ్లపాటు ఈ మట్టిని వైసీపీ ఎమ్మెల్యేల నుంచి నేతల వరకు దొరికిన కాడికి అమ్మేసుకుని జేబులు నింపేసుకున్నారు. దీంతో ఇప్పుడు పోలవరం కాలువ వెంబడి ఎక్కడ చూసినా మట్టి మేటలు కాదు కదా.. తట్ట మట్టి కూడా మిగల్లేదు. జల్లెడ పట్టి చూసినా మేటల ఆనవాళ్లే కనిపించడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాలో పోలవరం కాలువ మట్టి గత వైసీపీలో అధికారపార్టీ నేతలకు కల్పతరువుగా మారింది. ఎవరికివారు అనుమతులతో సంబంధం లేకుండా తవ్వి తరలించేసుకుని కోట్లలో సంపాదించుకున్నారు. ప్రభుత్వ ఖజానాకు జమ కావాల్సిన డబ్బును ఎంచక్కా జేబుల్లో వేసుకుంటున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన గనులు, జలవనరులశాఖ అధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి జిల్లాలో 90శాతం మాయమైపోయింది. ఒకప్పుడు భారీ మేటలున్న ప్రాంతాల్లో ప్రస్తుతం బోడి కాలువ కనిపిస్తోంది.

వేలాది టిప్పర్లతో అమ్మకాలు

వాస్తవానికి జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. ఈ కాలువను 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో 18 మీటర్ల లోతుకు తవ్వారు. దీంతో జిల్లాలో 2.50కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటినీ కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో అప్పట్లో పోగేశారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఈ మట్టిపై ఎవరూ కన్నెత్తి చూడలేదు. వేసిన మట్టి పోగులు వేసినట్లే ఉన్నాయి.

తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతల కళ్లు ఈ మేటలపై పడ్డాయి. గతేడాది పేదల ఇళ్లస్థలాల చదునుకు భారీగా మట్టి అవసరం ఉండడంతో జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని, కాకినాడ నియోజకవర్గాలకు చెందిన అప్పటి ఎమ్మెల్యేలు, ఇతర నేతలకు కాసుల పంట పండింది. ప్రభుత్వ అవసరాలకు మట్టి తవ్వే ముసుగులో ఈ మట్టంతా మింగేశారు. అనుమతులతో సంబంధం లేకుండా గుట్టుచప్పుడుకాకుండా పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు పెట్టి వేలాది టిప్పర్లతో అమ్మకాలు జరిపి కోట్లు గడించారు. ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయ రహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యుబిక్‌మీటర్లు, తునిలో 70లక్షలకుపైగా క్యుబిక్ మీటర్ల మట్టి నిల్వలుండేవి. ఇప్పుడిదంతా ఖాళీ అయిపోయింది. ముఖ్యంగా తుని నియోజవర్గం పరిధిలో ఇతర ప్రాంతాల కంటే ఎక్కువ మట్టి పోగయ్యింది. కొండలు, గుట్టల మీదుగా కాలువ వెళ్లడంతో ఎక్కువ మట్టి మేటలు ఏర్పడ్డాయి. దీన్నంతా అక్కడి మాజీ ఎమ్మెల్యేల మనుషులు అమ్మేసి రెండు చేతులా సంపాదించారు. వాస్తవానికి రాష్ట్ర ఖజానా అప్పుల్లో కూరుకుపోవడంతో ఉభయగోదావరి జిల్లాల్లో పోలవరం మట్టిని వేలం వేసి రూ.800కోట్ల నిధులు ఖజానాకు సమకూర్చాలని అధికారంలోకి వచ్చిన కొత్తలో అప్పటి వైసీపీ ప్రభుత్వం భావించింది. జిల్లాలో మట్టి ద్వారా రూ.150కోట్ల వరకు వస్తుందని అంచనా వేసింది. కానీ ఇదంతా ఖాళీ అయిపోయి ఐదేళ్లలో వైసీపీ నేతల జేబుల్లోకి ఈ డబ్బంతా చేరిపోయింది.

మట్టి మాయంపై సీఎం ఆగ్రహం

విలువైన పోలవరం మట్టిని వైసీపీ నేతలు ఈ ఐదేళ్లలో మింగేసిన వైనంపై సీఎం చంద్రబాబు ఇటీవల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గనులు, మట్టి దోపిడీపై ఇటీవల ఇచ్చిన ప్రజంటేషన్‌లో వైసీపీ నేతల మట్టి దందాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం కాలువ గట్టు బలహీనపడేలా చేసి జేబులు నింపేసుకున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో కాలువలో వరద పొంగితే తీవ్ర నష్టం వస్తుందని తెలిసినా ఖాతరు చేయలేదని మండిపడ్డారు. ఇలా మట్టిని దోచుకుపోయిన వారిని వదిలేదని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో దీనిపై విచారణ జరిపితే దొరికిపోతామనే భయం ఇప్పుడు అక్రమార్కులకు పట్టుకుంది. అందులో భాగంగా మొత్తం మట్టి నిల్వలు ఎన్ని ఉండేవి? వీటికి అధికారికంగా తవ్వుకోవడానికి ఇచ్చిన పర్మిట్లు ఎంత? ఎంత మేరకు తవ్వడానికి అనుమతి ఇచ్చారు? ఎవరికి ఇచ్చారు? మిగిలిన మట్టి ఏమైంది? బాధ్యులైన అధికారులు ఏం చేస్తున్నారు? వారి పాత్ర ఏంటనే దానిపై ఆరా తీయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా చర్యలు ఎవరిపై ఉంటాయోనని ఇప్పుడు మట్టి దొంగలతోపాటు కొందరు అధికారులు వణుకుతున్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రంపై సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24: జిల్లా దివ్యాంగుల పునారావాస కేంద్రం చైర్మన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా దివ్యాంగుల పునారావాస కేంద్రం ప్రగతిపై మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉమాఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, కాకినాడ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరెడ్డి పునారావాస కేంద్రం కార్యక్రమాలు 2023-24 వార్షిక ప్రగతిని కమిటీ సభ్యులకు వివరించారు. జాతీయ శారీరక వైకల్య నిర్వహణ సంస్థ గత క్యాంపులో గుర్తించిన దివ్యాంగులకు 2024, ఆగస్టు 8న బ్యాట్రీ మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్స్‌ను ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, కాకినాడ సంస్థ ప్రాంగణంలో బహుకరిస్తామని ఈడీ డైరెక్టర్ రెడ్డి వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు సమగ్ర ప్రణాళిక: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24: ఉప్పాడలో కోతకు గురవుతున్న సముద్ర తీరప్రాంత రక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోతనుంచి కాపాడేందుకు అవసరమైన ప్రణాళికలపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. ఉప్పాడ సముద్ర కోతకుగల కారణాలు, నివారణోపాయాలపై ఎన్‌సీసీఆర్ జాయింట్ సెక్రటరీ రమణమూర్తి వివరించారు. నేమాంలో తీరప్రాంత కోత, హోప్ ఐలాండ్ ప్రాముఖ్యత, ఫిషింగ్ హార్బర్, కాకినాడ సీపోర్టు కార్యకలాపాలు, మడ అడవులు పరిరక్షణ, కాకినాడ పోర్టు నుంచి ఉప్పాడ తీర ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రాజెక్ట్‌లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో భరణి, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, ఉపాధి శిక్షణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోర్టులో టోల్‌గేట్ల ఏర్పాటుపై చర్చ


ప్రైవేటు గొడౌన్లలో అధికారులు సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం

» పీడీఎస్ బియ్యం రవాణా అడ్డుకోవడమే లక్ష్యంగా కలెక్టర్ నిర్ణయం
» ఇతర దేశాలకు పీడీఎస్ బియ్యం వెళ్లకుండా చెక్‌పోస్టులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24: కాకినాడ పోర్టులో టోల్‌గేట్లు ఏర్పాటు చేయడంపై కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో చర్చించారు. పోర్టులో ఎక్కడెక్కడ టోల్‌గేట్లు ఏర్పాటు చేసి రవాణా అవుతున్న బియ్యాన్ని తనిఖీ చేస్తే పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోగలం అనే అంశాన్ని సమీక్షించారు. గతనెలలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో పోర్టులో బియ్యం గొడౌన్లపై దాడులు చేయగా రూ.154కోట్ల విలువైన 50,647 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు గుర్తించి సీజ్ చేశారు. దీనిలో 26,488 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని కెర్నెల్స్ కల్గిన పీడీఎస్ బియ్యంగా గుర్తించి ఆయా గొడౌన్ల యాజమాన్యంపై 6ఏ కేసులు నమోదు చేశారు. మిగిలిన బియ్యాన్ని గొడౌన్లకు అప్పగించారు. కాకినాడ పోర్టునుంచి పెద్దఎత్తున ఆఫ్రికా ఖండంలో వివిధ పేద దేశాలకు బియ్యం రవాణా చేసినట్లు విచారణలో రుజువు కావడంతో దీనిపై అధికారులు పట్టు బిగిస్తున్నారు. అసలు యాంకరేజ్ పోర్టుకు ఏ దారిలో పీడీఎస్ బియ్యం వస్తుంది, దాన్ని ఎలా కనిపెట్టాలి, ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్ షాన్‌మోహన్ కస్టమ్స్ అధికారులు, పోలీసు అధికారులు, పోర్టు అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. అమరావతి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టు, కుంభాభిషేకం వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుపై సమాలోచనలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాలనుంచి లోడ్‌తో వస్తున్న లారీలు ఏ మార్గం ద్వారా పోర్టు వస్తున్నాయి, వాటిలో ఉన్న బియ్యంలో కెర్నెల్స్ ఉన్న పోర్టిఫైడ్ రైస్‌ను ఎలా గుర్తించాలి అనే అంశాలను క్షుణ్నంగా సమీక్షించారు. సమావేశంలో డీఎస్‌వో ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం బాల సరస్వతి, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ


నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 24: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ జె.వెంకటరావు నూతన కమిషనర్‌కు బాధ్యతలు అప్పగించారు. విధుల్లో చేరేందుకు వచ్చిన కమిషనర్ భావనకు బదిలీపై వెళ్తున్న కమిషనర్ వెంకటరావు, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వివిధ విభాగాధిపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించాలన్నదే తన ప్రధాన కర్తవ్యమన్నారు. ముఖ్యంగా ప్రజల కనీస అవసరాలైన మంచినీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు స్మార్ట్‌సిటీల్లో ఒకటైన కాకినాడకు కళలకు కాణాచిగా ప్లాన్డ్ సిటీగా పేరుందని, అలాంటి నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని అన్నారు. దేశంలోనే కాకినాడ నెంబర్‌వన్ స్మార్ట్‌సిటీగా గుర్తింపు పొందేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఇక్కడ సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులు ఉన్నారని అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏవో శిరీష్, ఈఈ మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, శానిటరీ సూపర్‌వైజర్లు సత్తెప్ప నాయుడు, రాంబాబు ఉన్నారు.

ఎన్‌టీఆర్ పింఛన్లకు పెద్దఎత్తున దరఖాస్తులు

» జిల్లావ్యాప్తంగా నెలరోజుల్లో 150 అర్జీలు
» గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేడు అధికారుల వద్దకు బాధితులు
» విచారణ చేసి అర్హులను ఎంపిక చేసేందుకు కసరత్తు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకోసం జిల్లాలో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు పంపి విచారణ చేయిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో ఉన్న 21మండలాల్లో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల 2,79,319మందికి ప్రతినెలా అందజేస్తున్నారు. దీనిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, మత్స్యకారులు, గీత కార్మికులు, ఒంటరి మహిళ, చర్మకారులు, చేనేత కార్మికులు ఉన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనుంచి పింఛన్లను అందజేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల జిల్లాలో ఇంకా పింఛన్లను పొందే అర్హులు ఉండిపోయారు. గత ప్రభుత్వం కక్ష ధోరణిలో వ్యవహరించడంవల్ల తాము పింఛన్లు పొందలేకపోయామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గతనెలరోజుల్లో 150కిపైగా దరఖాస్తులు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకోసం వచ్చాయి. దీనిలో వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు ఉన్నారు. వీరు జిల్లా కలెక్టరేట్‌తోపాటు వివిధ మండలాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు వీటిని విచారణ చేయాలని క్షేత్రస్థాయిలో అధికారులకు పంపించారు. వాటిని క్షేత్రస్థాయి అధికారులు విచారణ చేస్తున్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు అర్హత కల్గిన ప్రతిఒక్కరికీ పింఛన్ అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

విధివిధానాల కోసం ఎదురుచూపులు

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల తుది మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాల కోసం జిల్లా అధికారులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఎంతమందిని ఈ పింఛన్ల కోసం ఎంపిక చేయాలి, దానికి ఎలాంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని అనే అంశాలపై ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు.

వారం వారం పెరుగుతున్న సంఖ్య

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల కోసం వచ్చే ఆశావాహుల సంఖ్య వారం వారానికి పెరుగుతుంది. వైసీపీ ప్రభుత్వంలో అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా కరుణించలేదని వాపోతున్నారు. పింఛన్ల ఎంపికలో వివక్షత చూపించారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగి పింఛన్ అందిస్తారని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక నిఫా వైరస్ వార్డు ఏర్పాటు

» కేంద్రం సూచన మేరకు వార్డు ఏర్పాటు


ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటైన ప్రత్యేక నిఫా వైరస్ వార్డు

జీజీహెచ్(కాకినాడ), జూలై 24: కాకినాడ జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో ఆరు పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక నిఫా వైరస్ వార్డును ఏర్పాటు చేశారు. కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ సోకి 14ఏళ్ల బాలుడి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా దేశంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఈ ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. అందులోభాగంగా జీజీహెచ్‌లో ఈ వార్డు ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపారు. గబ్బిలం ద్వారా ఈ వైరస్ సోకుతుందని, వాటి మలమూత్రాదులు, అవి స్రవించే సలైవా ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. జ్వరం, జలుబు, దగ్గు గొంతునొప్పి, తలనొప్పి, వాంతులు తదితర లక్షణాలు ఉంటాయని ఆమె వెల్లడించారు. ఈ లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని డాక్టర్ లావణ్యకుమారి కోరారు. మైక్రోబయాలజీ, పల్మనాలజీ, అనస్తీషియా, మెడిసిన్ విభాగాలనుంచి నిష్ణాతులైన వైద్యబృందాన్ని ఈ నిఫా వైరస్ వార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు 24/7 తమ సేవలను వినియోగిస్తామన్నారు. రాష్ట్రానికి ఇటువంటి వైరస్ ఛాయలు లేకపోయినా కేంద్రం సూచన మేరకు ఈ వార్డు ఏర్పాటు జరిగిందన్నారు.

యూనివర్సిటీ తరపున హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్

» జేఎన్టీయూకే రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయాలన్న ఆదేశాలపై వర్సిటీ పీఆర్వో వివరణ
» ఉత్తర్వులపై హైకోర్టుకు వెళ్లగా స్టేతోపాటు నాలుగు వారాల గడువు ఇచ్చిన కోర్టు

జేఎన్టీయూకే, జూలై 24: కాకినాడ జేఎన్టీయూకే రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయాలని సీఐడీకి హైకోర్టు ఆదేశించడంపై పీఆర్వో సీహెచ్ సాయిబాబు వివరణ ఇచ్చారు. వర్సిటీకి సంబంధించిన అన్ని రకాల కోర్టు కేసులను పర్యవేక్షించడానికి హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ ఉంటారన్నారు. ఆయన వర్సిటీ అధికారులను క్రమంతప్పకుండా సంప్రదించి ప్రతి కేసుకు కోర్టుకు ఎటువంటి సమాచారం ఇవ్వాలో పరిశీలిస్తారని స్పష్టం చేశారు. వర్సిటీకి సంబంధించి మంగళవారం జరిగిన కేసుకు వకాల్తా తీసుకోవాల్సి ఉందని, కానీ అదే సమయానికి స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ మరో కోర్టు హాలులో వేరే ఫిర్యాదుకు సంబంధించిన కేసుకు హాజరుకావడంతో ఈ కేసుకు హాజరుకాలేకపోయారన్నారు. కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై బుధవారం హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా ప్రధాన న్యాయమూర్తి సానుకూలంగా స్పందించి స్టే విధించి నాలుగువారాలు గడువు ఇచ్చి పూర్తి సమాచారంతో హాజరుకావాల్సిందిగా ఆదేశాలు జరీ చేశారన్నారు.


ఐదుగురు వాహనదారులకు జైలుశిక్ష

కాకినాడ క్రైం, జూలై 24: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురు వాహనదారులకు రెండేసి రోజుల జైలుశిక్షను విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పునిచ్చారు. రోడ్డుప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్-1, 2 స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ సీఐలు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 14మందిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్-1లో 10మంది, రెండు పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఐదుగురికి తలో రెండురోజుల జైలు శిక్ష విధించారు. 9మందికి తలో రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐలు తెలిపారు.

కాకి లెక్కలు
» పోలవరం ముంపు లెక్కలను చెరిపేసిన గోదావరి వరద - 7లో
» 41.15 మీటర్ల స్థాయిలో రెండు విలీన మండలాల్లో 19 ఆవాసాలకే ముంపు

మత్స్యకారుల జీవనోపాధిని కొల్లగొట్టే.. గత ప్రభుత్వ జీవో రద్దు చేయాలి

» అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ సిటీ, జూలై 24: మత్స్యకారుల జీవనోపాధిని కొల్లగొట్టడానికి గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 217ను రద్దుచేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. దీనిపై బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ధాలకాలంగా అనేక మంది మత్స్యకారులు స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఆనాడు ఎన్టీఆర్ చెరువులు, రిజర్వాయర్లపై పూర్తి హక్కును ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీలకు ఇచ్చి మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. అనంతరం చంద్రబాబు మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి సబ్సిడీలపై వలలు, ఐస్ బాక్సులు, టూ వీలర్స్ వాహనాలు అందించి ఆదుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు సంబంధించిన చెరువులను, రిజర్వాయర్లను దోచుకోవడానికి జీవోనెంబరు 217ను తీసుకువచ్చిందన్నారు. ఈ జీవో ద్వారా చెరువులకు, రిజర్వాయర్లకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి వైసీపీ అనుయాయులకు అప్పజెప్పేందుకు జగన్మోహనరెడ్డి కుట్ర పన్నడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అనేక నిరసనలు, దీక్షలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 217 జీవోను రద్దు చేస్తామని చంద్రబాబు మాట ఇచ్చారన్నారు. దీనిపై రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికోసం టీడీపీ ఎప్పుడూ కట్టుబడి ఉందని, మత్స్యకారుల జీవ నోపాధిని కొల్లగొట్టడానికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జీవోను రద్దు చేస్తున్నామని అసెంబ్లీలో ప్రకటించారు.


వరద ముంపులో వీఆర్ పురం మండలం శ్రీరామగిరి

కాకి లెక్కలు

- పోలవరం ముంపు లెక్కలను చెరిపేసిన గోదావరి వరద
- 41.15 మీటర్ల స్థాయిలో రెండు విలీన మండలాల్లో 19 ఆవాసాలకే ముంపు
- నాలుగు విలీన మండలాల్లో 100కు పైగా ఆవాసాలపై వరద ప్రభావం

(రంపచోడవరం)

పోలవరం ప్రాజెక్టు కింద అల్లూరి జిల్లాకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న ముంపు లెక్కలన్నీ గోదావరి వరదలతో కాకి లెక్కలుగా తేలిపోతున్నాయి. పోలవరం తొలి దశ +41.15 మీటర్లకు మించిన కాంటూరు స్థాయిలో ప్రభావితమయ్యే ఆవాసాలన్నీ వరద ప్రభావితమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల దశలో సంపూర్ణతకు సమయం పట్టే పరిస్థితుల్లో తొలి దశగా 41.15 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు గత ప్రభుత్వం వేసిన ముంపు లెక్కలు తప్పుతున్నాయి. ప్రాజెక్టు మొదటి దశ స్థాయికి అంచనా వేసిన ముంపు కంటే ముంపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని గత రెండు గోదావరి వరదలతో పాటు తాజాగా వచ్చిన వరదలు మరోమారు స్పష్టం చేశాయి. తొలి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలతో పాటు రెండు విలీన మండలాల్లో 21 ఆవాసాలు మాత్రమే ముంపునకు గురవుతాయని అధికార లెక్కలు చెప్తుంటే తాజా వరదలు నాలుగు విలీన మండలాల్లో +46 మీటర్ల కాంటూరు స్థాయిలో ఉన్న ఆవాసాలన్నిటిపైనా ప్రభావం చూపాయి. ఈ విధంగా అవి 100కు పైగా ఆవాసాలను ప్రభావితం చేశాయి. ఈ ప్రకారం చూస్తే పోలవరం ముంపు ప్రభావిత అంచనాలకు ఐదు రెట్లకు మించిన ముంపు ఈ వరదల్లో కానవస్తోంది. పోలవరం గత అధికారుల అంచనా లెక్కలు నిజమా లేక ముంచెత్తిన వరద లెక్కలు నిజమా అన్నది చర్చనీయాంశమైంది.

నిజానికి పోలవరం ప్రాజెక్టు కింది 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేయాలన్నది లక్ష్యం. కాగా ఆచరణలో ఇప్పటికి ఇది సాధ్యం కాదని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశతోనే నీటిని నిల్వ చేసి ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని నిశ్చయించాయి. తొలి దశలో ముంపు తీవ్రత అల్లూరి జిల్లా దేవీపట్నం, వీఆర్ పురం, కూనవరం మండలాల్లోని 63 ఆవాసాల్లో 5,618 మంది నిర్వాసిత కుటుంబాలపై ప్రభావం చూపాలి. అయితే గోదావరికి వచ్చిన వరదలను పరిశీలిస్తే పోలవరం ముంపు అంచనాలు తప్పవుతున్నాయి. తాజాగా వచ్చిన గోదావరి వరదలు పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ వద్ద 34 మీటర్లను దాటి వరద ప్రవహించలేదు. కానీ వరదకు మునిగిపోయిన గ్రామాల లెక్కలు మాత్రం పోలవరం ప్రాజెక్టు తొలి దశ (+41.15 మీటర్ల)కు మించే ఉన్నాయి.

మొదటి దశలో దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాలు మునిగిపోతాయి. ఇందులో తాజా వరదల లెక్కలతో పోల్చినా ఎటువంటి వివాదం లేదు. కానీ విలీన మండలాల విషయానికొస్తే తొలి దశలో కేవలం వీఆర్ పురం మండలంలోని 18 ఆవాసాల్లో 2128 నిర్వాసిత కుటుంబాలు, కూనవరం మండలంలోని ఒక గ్రామంలో 216 నిర్వాసిత కుటుంబాలు మాత్రమే ప్రభావితం కావాలి. కానీ ఇప్పుడు ఎదురైన గోదావరి నాలుగు విలీన మండలాల్లోని 100కు పైగా ఆవాసాల్లో 10వేల నిర్వాసిత కుటుంబాలను ప్రభావితం చేశాయి. ఈ పోలవరం లెక్కలను, వరద లెక్కలను పరికించి చూస్తే వాస్తవ విరుద్ధంగా పోలవరం ముంపు లెక్కలు ఉన్నాయన్నది గోదావరి సాక్షిగా తేటతెల్లమవుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విలీన మండలాల నిర్వాసితులు వరదలు వచ్చిన ప్రతిసారీ తమకు పరిహారాలను చెల్లించేసి, పునరావాసాన్ని కల్పిస్తే గ్రామాలు ఖాళీ చేసేస్తామని ఎక్కడికక్కడ అధికారులను నిలదీసేవారు. కానీ వారికి ఎక్కడా న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి ఇక్కడి ప్రజలు సరైన గుణపాఠమే చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావంతో ఉన్నారు.


స్వీట్లతో అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

పార్వతి అమ్మవారికి సారె మహోత్సవం

150 రకాల స్వీట్లు సమర్పించిన భక్తులు

బిక్కవోలు, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో వున్న పార్వతి అమ్మవారికి సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం సారె మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణశర్మ, రఘు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామోత్సవంలో భక్తులు తీసుకువచ్చిన సారెతో పాటు గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో పాటు 150 రకాల స్వీట్లు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారెను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

బాలల వికాస గ్రామాలు నెలకొల్పాలి

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 24: జిల్లాల్లో బాలల వికాస గ్రామాలను నెలకొల్పేందుకు కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ కోరారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో 11 జిల్లాలకు చెందిన రెండో బ్యాచ్ డీఎల్ఎంటీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య, విద్యా రంగాలను సుస్థిరాభివృద్ధి సాధనలోని బాలల వికాస గ్రామం కోసం వనరులను ఎలా వినియోగించు కోవాలో వివరించారు. 11 జిల్లాలకు చెందిన మెడికల్, ఐసీ డీఎస్, పంచాయతీరాజ్ శాఖల డీఎల్ఎంటీలు హాజరయ్యారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, నీహారిక, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ధవళేశ్వరం బ్యారేజీ ఎగువున, దిగువున వరద ప్రవాహం

తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద అత్యధికంగా 14.90 అడుగులకు పెరిగిన నీటిమట్టం
- 14,56,651 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 24: గత ఐదు రోజులుగా పెరుగుతూ ప్రవహించిన గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం ఇప్పటికే తగ్గింది. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం మరలా పెరుగుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం తెల్లవారుజామున 14.90 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై 8 గంటల పాటు నిలకడగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు నెమ్మదించి రాత్రి 7 గంటలకు 14.60 అడుగులుగా నమోదయ్యింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 14.04 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. అత్యధికంగా 14,56,651 క్యూసెక్కులు ప్రవాహం సముద్రంలోకి ప్రవహించింది. ప్రస్తుతం ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. నీటిమట్టం తగ్గుముఖం పడుతుండడంతో గురువారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమేపీ తగ్గుతున్న నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 45.20 అడుగులుగా నమోదైంది. రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇంద్రావతి పరివాహకంలో కురిసిన వర్షాల వల్ల పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతుండగా... దాని ప్రభావంతో భద్రాచలం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం పెరగవచ్చని అంచనా.

బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటిమట్టం 11.45 మీటర్లు నమోదు కాగా తగ్గుముఖం పట్టింది. పేరూరు వద్ద 16.38 మీటర్లు నమోదు కాగా పెరుగుతోంది. దుమ్ముగూడెం వద్ద 12.03 మీటర్లు, భద్రాచలం వద్ద 45.20 అడుగులు, కూనవరం వద్ద 20.62 మీటర్లు, కుంట వద్ద 12.10 మీటర్లు, పోలవరం వద్ద 13.32 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.92 మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

శాంతించిన శబరి

- చింతూరు వద్ద 39 అడుగులకు శబరి నీటిమట్టం
- డొంకరాయి జలాశయంలో ప్రమాద స్థాయిలో నీటిమట్టం
- ఏ క్షణంలోనైనా నీటిని విడుదల చేస్తామంటున్న జెన్‌కో అధికారులు

చింతూరు, జూలై 24: శబరి ఉధృతి కాసింత ఊరటనిచ్చింది. మంగళవారం రాత్రి 41.6 అడుగులు ఉన్న నీటిమట్టం బుధవారం రాత్రికి మరింత తగ్గి 39 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి బుధవారం సాయంత్రానికి 45.2 అడుగులకు చేరుకోగా గురువారం ఉదయానికి తిరిగి 48 అడుగులకు చేరుకోవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన కుండపోతగా వర్షం కురుస్తుండడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. ముంపు కారణంగా చింతూరు డివిజన్ పరిధిలోని 82 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద కారణంగా పలు ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు తీగలపై చెత్త పేరుకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చింతూరు డివిజన్లో ఇప్పటివరకు 11 ఆవాసాలు పూర్తిగా నీటి మునిగాయి. 54 గ్రామాలకు చెందిన రహదారులు జలదిగ్బంధంలో వున్నాయి. ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 960 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు బాధిత కుటుంబాలు అడవులు, గుట్టల్లో పాకలు వేసుకున్నాయి.

మోతుగూడెం: డొంకరాయి జలాశయంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరువలో ఉంది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుధవారం నాటికి నీటిమట్టం 1035.20 అడుగులకు పెరిగింది. దీంతో జెన్‌కో అధికారులు



అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ వాగుల నుంచి జలాశయంలోకి ప్రస్తుతం 8వేల వరకు ఇన్‌ఫ్లోస్ వస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. నీటిమట్టం 1036 అడుగులకు పెరిగితే వెంటనే దిగువకు నీటిని విడుదల చెయ్యడానికి అధికారులు సమాయత్తమయ్యారు. దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కోసం 2300 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్‌లోకి విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు చెప్పారు.


చింతూరు డివిజన్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

వరద ముంపులో కలెక్టర్ పర్యటన... బాధితులతో మమేకం

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం బుధవారం చింతూరు డివిజనులోని వరద ప్రభా విత ప్రాంతాల్లో పర్యటించింది. అధికారులు నాటు పడవలు, ట్రాక్టర్లు, లాంచీలు, కాలినడకన ప్రయాణం చేసి వలస గుడిసెల వద్దకు చేరుకున్నారు. బాధితులతో మమేకమై సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. బాధిత కుటుంబా లకు ప్రభుత్వం తరఫున బియ్యం, కందిపప్పు, పామాయిలు, కిరోసిన్, కూరగాయలు సరఫరా చేశారు. వరరామచంద్రపురం మండలం కల్లనూరుకు చెందిన బాలింత లక్ష్మిని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తన వాహనంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



వరదలోనే విధులు

ఎటపాక, జూలై 24: గోదావరి వరదలకు 11కేవీ విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు, ఎండిన పుల్లలు, చెత్త చిక్కుకున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం వరద ప్రవాహంలోనే నాటు పడవలపై వెళ్లి వాటిని తొలగించారని జేఈ గెల్లంకి రాజ్‌కపూర్ చెప్పారు. వీరాయిగూడెం గ్రామ శివారుతో పాటు రాయనపేట-గుండాల మధ్యలో వాగు ప్రాంతంలోని లైన్లు, నందిగామ గ్రామ శివారులోని స్తంభాలపై చిక్కుకున్న చెత్తను, ఎండిన పుల్లలను లైన్‌మన్ దేవేందర్ నాయక్, జేఎల్ఎం వీరబాబు తొలగించారు. అప్పటివరకు ఈ గ్రామాలకు వేరే ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. విద్యుత్ సిబ్బందిని పలువురు ప్రశంసించారు.

నందిగామ వద్ద విద్యుత్ స్తంభంపై చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


గ్యాస్ కంపెనీ యజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్యాలయంలో భారీ చోరీ

షట్టరు తాళాలు పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు. 2 సెల్‌ఫోన్ల చోరీ

అనపర్తి, జూలై 24: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి కెనాల్ రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో భారీ చోరీ జరిగింది. అనపర్తి ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ షట్టరు తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. రూ.1.50 లక్షల నగదుతో పాటు కంపెనీకి చెందిన రెండు సెల్‌ఫోన్లతో ఉడాయించారు. విషయం తెలుసుకున్న యజమాని కర్రి సాంబశివరెడ్డి పోలీసులను ఆశ్రయించడంతో సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సంఘటనాస్థలాన్ని పరిశీలించి యజమాని నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరిస్తోందని, సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ వివరించారు. యజమాని సాంబశివరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు చెప్పారు.



బోల్తా పడిన బోటు, సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

భైరవపాలెం సముద్రంలో బోటు బోల్తా

ఆరుగురు మత్స్యకారులను రక్షించిన 'రిలయన్స్' సిబ్బంది

ఐ.పోలవరం, జూలై 24: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం సముద్రంలో బుధవారం ఉదయం ఒక బోటు బోల్తా పడింది. భైరవపాలేనికి చెందిన పెమ్మాడి సూర్యారావు, దండుప్రోలు ఆదినారాయణ, కర్రి శామ్యూల్, పెమ్మాడి మల్లయ్య, పాలెపు ధర్మారావు, డొక్కాడి దొరబాబు సోమవారం సాయంత్రం రిలయన్స్ జెట్టీ సెక్యూరిటీలో పెట్రోలింగ్ విధుల నిమిత్తం ఇంజన్ బోటులో సముద్రంలోకి వెళ్లారు. సముద్ర అలల ఉధృతికి అది బోల్తా పడింది. మత్స్యకారులను రిలయన్స్ సంస్థ సిబ్బంది రక్షించి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వేధింపుల ఘటనపై విచారణ

- కాకినాడ జిల్లా ఫైలేరియా అధికారిణి ఫిర్యాదు ఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ని విచారణాధికారిగా నియమించిన వైనం
- తన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బాధితురాలి ఫిర్యాదు
- దీని ఆధారంగా ఇటీవల రాధాకృష్ణపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
- ఈలోపు గోదావరిలో దూకి గల్లంతైన సీనియర్ అసిస్టెంట్
- వివాద ఘటనపై మళ్లీ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్

కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఫైలేరియా విభాగం సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆ విభాగం ఉన్నతాధి కారిణి ఇచ్చిన ఫిర్యాదుపై లోతైన విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు పూర్తిస్థాయి విచారణకు డీఆర్డీఏ పీడీని నియమిం చారు. వాస్తవానికి ఈ విభాగం ఉన్నతాధికారి 15 రోజుల కిందట తన కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తూ డీఎంహెచ్‌వో నరసింహ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతి విచారణ చేపట్టారు. అసలు ఆ రోజు ఏం జరిగింది? ఛాంబర్‌లో ఉన్న మహిళా అధికారిణితో సీనియర్ అసిస్టెంట్ ఏ విధంగా ప్రవర్తించారు? దీనికి కారణాలేంటనే దానిపై బాధితురాలి నుంచి వివరణ తీసుకున్నారు. బాధితురాలి ఆరోపణలపై ఏం సమాధానం చెప్తారని సదరు సీనియర్ అసిస్టెంట్ వివరణ కూడా తీసుకున్నారు. దీనికి సంబంధించి విచారణ నివేదికను విచారణాధికారి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఈ నెల 17న అందించారు. నివేదికలో ఏం తేల్చారనే విషయం ఇంకా బయటకు రాలేదు. కానీ ఈలోపు సదరు సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ మంగళవారం యానాం వద్ద గోదావరిలో దూకి గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో వివాదం ముదరడంతో మరోసారి సదరు బాధితురాలికి జరిగిన అన్యాయం, అసలు ఆ రోజు ఏం జరిగింది? అనే దానిపై వాస్తవాలు వెలికితీసేలా కొత్తగా జిల్లా డీఆర్డీఏ పీడీతో విచారణ చేయించాలని కలెక్టర్ నిర్ణయించారు. మరోపక్క ఈ వివాదానికి సంబంధించి బుధవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ఫైలేరియా విభాగ ఉన్నతాధికారి అయిన బాధిత మహిళ తన వద్ద పనిచేసే సీనియర్ అసిస్టెంట్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఈ నెల 2న తమకు ఫిర్యాదు చేశారన్నారు. తనను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ గదిలో ఇద్దరం పక్కపక్క సీటులోనే కూర్చున్నామని, ఈ క్రమంలో తనతో సీనియర్ అసిస్టెంట్ అసభ్యంగా ప్రవర్తించారని బాధితురాలైన అధికారి తమకు వివరించారన్నారు. ఈ నేపథ్యంలో సదరు ఉద్యోగిని తాను సరెండర్ చేస్తున్నానని పేర్కొంటూ బాధిత అధికారి లేఖ ఇచ్చారు. సరెండర్ ఆమోదించే అధికారం తనకు లేదని, కావాలంటే రాధాకృష్ణను వేరేచోటకు బదిలీ చేస్తానని సదరు బాధితురాలైన అధికారికి చెప్పానన్నారు. కానీ తనకు సదరు సీనియర్ అసిస్టెంట్ ప్రవర్తన, పని విధానం నచ్చలేదని ఆమె తనతో చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో సదరు బాధితురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. 17న నివేదిక వచ్చిందని, దానికి సంబంధించి ఇంకా చర్యలు కూడా ప్రారంభించలేదని, కానీ ఈలోపు రాధాకృష్ణ నదిలోకి దూకారన్న సమాచారం తెలిసిందని వివరించారు.

ఫైలేరియా అధికారిణిపై బదిలీ వేటు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 24 జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఓ సీనియర్ అసిస్టెంట్ గోదావరిలో పడి గల్లంతవ్వడానికి ఆమె కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారిణి పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ బుధవారం రాత్రి బదిలీ వేటు వేశారు. ఆమెను తొండంగి మండలం కేపీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.

తుని ఏరియా ఆసుపత్రిలో కుప్పకూలిన పైకప్పు

ఘటనా స్థలంలో 12 మంది రోగులు.. తప్పిన ప్రమాదం




తుని రూరల్, జూలై 24: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో శ్లాబు నుంచి నీరుదిగడంతో పైకప్పు కుప్పకూలింది. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో ఆర్థోపెడిక్ వార్డులో ఈ ఘటన జరిగింది. పై కప్పు కూలి కింద ఉన్న సీలింగ్ మీద పడే క్రమంలో పెద్ద శబ్దం రావడంతో ఆ వార్డులో ఉన్న 12 మంది రోగులు పరుగులు తీశారు. డ్యూటీ నర్సులు, వైద్యాధికారుల ఆదేశాల మేరకు వారిని మరో వార్డుకు షిఫ్ట్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే యనమల దివ్య... భవనాల పటిష్టతను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు

గోకవరం, జూలై 24: ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబించడం వల్ల రైతులకు, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయనతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు విధానం, పంట దిగుబడి, పెట్టుబడి తదితర విషయాలను ప్రాజెక్టు మేనేజర్ తాతారావు రైతులకు వివరించారు. ప్రకృతి సాగులో వినియోగించే బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాన్ని కూడా తెలిపారు. పాడి పరిశ్రమతో పాటు ప్రకృతి విధానంలో తాను సాగు చేస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ క్షేత్రానికి చెందిన రైతు కోరిపల్లి అప్పలస్వామి వివరించాడు.



కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ), జూలై 24: కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో పనిచేయడానికి ఉదయం 10గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. సహాయం కోసం 0884 2373270 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై 24: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని జగన్ తన సైకో మనస్తత్వంతో భ్రష్టు పట్టించారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి కేంద్రం ద్వారా వేల కోట్ల రూపాయిల నిధులు తీసుకువచ్చారని తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేలు కోట్లు ఇవ్వడంతో పాటు అదనంగా ఎంత అవసరమైన ఇస్తామని కేంద్రబడ్జెట్‌లో ప్రకటించారని, పోలవరం నిర్మాణానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌తో పరిశ్రమలు రానున్నాయన్నారు. పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో ఉన్న హామీలు అన్నింటిని నెరవేరుస్తామని కేంద్రం చెప్పిందని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించడం, ఇందుకు పవన్‌కల్యాణ్ సహకరించడంతో ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా ఇన్ని నిధులు సాధించుకోగలిగామని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు అనిశెట్టి సత్యానందరెడ్డి, పిల్లి చిన్నా, సోము సత్యనారాయణ, నల్లా శ్రీను, బస్సా సత్యనారాయణ, కుక్కల రామకృష్ణ, ఆలం దొరబాబు, నూతాటి ప్రకాష్, మట్టా గణేష్, కేతవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు సమర్థతతోనే రాష్ట్రానికి నిధులు'

సర్పవరం జంక్షన్, జూలై 24: రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.15వేలకోట్లు సాధించడ ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతకు నిదర్శమని టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. బుధవారం వలసపాకల నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అందించిన అపూర్వ విజయానికి తగిన ప్రతిఫలం బడ్జెట్‌లో ఏపీకి తగిన ప్రాధాన్యత లభించిందన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తిచేస్తామని చెప్పడం శుభపరిణామమన్నారు. రానున్న ఐదేళ్లలో అమరావతి అభివృద్ధితో పాటూ రాష్ట్ర రూపరేఖలు మారిపోనున్నాయని, కూటమి పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందడం ఖాయమన్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు అభినందనలు

తాళ్లరేవు: రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం నుంచి అధిక నిధులు సాధించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి దూళిపూడి వెంకటరమణ అభినందనలు తెలియజేశారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తికోసం కేంద్ర సహకారంపై హర్షం వ్యక్తం చేశారు.

ఆర్వోబీ నిర్మాణానికి సహకరించాలి: ఆర్డీవో

పిఠాపురం, జూలై 24: పట్టణ పరిధిలోని ఉప్పాడ రైల్వేగేటు వద్ద నిర్మించ తలపెట్టిన రైల్వేఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణానికి సహకరించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో ఆర్వోబీ నిర్మాణం వల్ల భూములు, స్థలాలు, భవనాలు కోల్పోయే యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఆర్వోబీకి 6 ఎకరాల భూమి అవసరమవుతుందని, ఇందులో 2ఎకరాల ప్రవేటు భూమిని సేకరించామన్నారు. దీనికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా యజమానులు భూసేకరణ ప్రతిపాదనలకు అభ్యంతరం చెబుతూ పిఠాపురం షుగర్ ఫ్యాక్టరీ స్థలం నుంచి చిత్రాడ ఆర్వోబీ వద్దకు కలపాలని కోరారు. సమావేశంలో ఆర్అండ్‌బీ డీఈఈ అశ్రిత, డిప్యూటీ తహశీల్దారు రామచంద్రారెడ్డి, నాగేశ్వరరావు, గోవిందు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవకతవకలపై విచారణ

పిఠాపురం, జూలై 24: పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని, పనులు చేయకుండానే బిల్లులు చేశారని, ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలను కబ్జా చేశారని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు, పట్టణ వాసులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంజనీరింగ్ విభాగంలో పనులపై విచారణకు కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఈఈ వెంకట్రావును కలెక్టర్ విచారణాధికారిగా నియమించారు. ఆయన బుధవారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. సీతారాంపురం, జగ్గయ్యచెరువు కాలనీల్లో పైపులైన్లు, రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంలో అవినీతి, అవకతవకలు, ఇతర అంశాలపై విచారణ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులను విచారించారు. ప్రభుత్వస్థలాల ఆక్రమణ విషయంపై ప్రత్యేకంగా నియమితులైన సర్వే అధికారులు వచ్చి రికార్డులు పరిశీలించి ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. 2, 3 రోజులు పాటు విచారణ సాగే అవకాశం ఉంది.

వైరల్ జ్వరాలతో బాధపడుతున్న మత్స్యకారులు

ఉప్పాడ (కొత్తపల్లి), జూలై 24: తీరప్రాంతాల మత్స్యకారులు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఇటీవల వర్షాలకు ఉప్పాడ శివారు మాయాపట్నంలో వీధుల్లన్నీ వర్షంనీటితో నాచుపేరుకుపోయింది. వర్షం నీటికి తోడు సముద్రం నీరు కూడా చేరడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయని టీడీపీ మత్స్యకార విభాగం మహిళా నాయకురాలు మూగి సత్యవతి ఆవేదన చెందారు. తీర ప్రాంతంలో బాడి, బురదతో ఉన్న వీధుల్లో పంచాయతీ సిబ్బంది కనీసం బ్లీచింగ్, పారిశుధ్య పనులు కానీ చేపట్టలేదని... అధికారులు తీరప్రాంత గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు.

'విద్యతోపాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలి'

కరప, జూలై 24: విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యతనివ్వాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచించారు. నడకుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వహించిన శిక్షా సప్తాహ సభలో వారు మాట్లాడారు. యోగా గురువు పి.వసంతరాముడు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. పాఠశాల పీడీ జీహెచ్ వెంకట్రావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి.వెంకట్రావు విద్యార్థులతో పలు ఆటలు ఆడించారు. యంగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ, హెచ్‌ఎం మురళీబాబు, మెండు గోవిందు, కృష్ణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు, జూలై 24: చొల్లంగి విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీ లైను వార్షిక మరమ్మతుల నిమిత్తం మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలకు, కోరింగ, పెద, చినబొడ్డు వెంకటాయపాలెం, సీతారామపురం, చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సామర్లకోటకు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

సామర్లకోట, జూలై 24: సామర్లకోట పట్టణానికి 2 శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియమితులయ్యారు. మంగళవారం సామర్లకోటలో పర్యటించిన కలెక్టర్ అపారిశుధ్యాన్ని కలెక్టర్ పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ ఉన్నతాధికారులను ఆదేశించడంతో బుధవారం సాయిచరణ్, రవికృష్ణను నియమించడంతో బుధవారం సామర్లకోటకు చేరుకున్నారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, కమిషనర్ జాస్తి రామారావులను మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి విధులను అప్పగించారు.

'కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట'

కాకినాడ సిటీ, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించిందని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా శాఖ చైర్మన్ పితాని త్రినాథ్, సెక్రటరీ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇన్‌కమ్‌టాక్స్ సంబంధించి కొత్త పన్ను విధానంలో కొత్తగా స్లాబులు, స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో రూ.10లక్షల లోపు ఆదాయం పొందే ప్రభుత్త ఉద్యోగులకు బాగా ఊరట కలిగిందన్నారు.

కంప్యూటర్ ప్రింటర్ వితరణ

సర్పవరం జంక్షన్, జూలై 24: జనసేన పార్టీ సిటీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి ఈశ్వర్ రూ.20 వేల ఆర్థిక సహకారంతో సమకూర్చిన కంప్యూటర్ ప్రింటర్‌ను 49వ డివిజన్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీనుచంద్రకు అందించారు. ఈశ్వర్‌కు డాక్టర్ అభినందనలు తెలిపారు. జనసేన డివిజన్ ప్రెసిడెంట్ మల్లిపూడి బాలు నగేష్, అనుసూరి రాజకుమారి, పెద్దా, పవన్, కల్యాణ్, కిరణ్,రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలేశ్వరం, జూలై 24: నిరుద్యోగ యువతకు పలు కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్ఎస్.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమా పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా 3నెలల పాటు కార్యాలయాల్లో అసిస్టెంట్, కంప్యూటర్ కోర్సులపై శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువత ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తులు

జగ్గంపేట, జూలై 24: జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండల గ్రామాల్లో ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఈ నెల 27వ వరకు స్వీకరించనున్నారు. పూర్తి వివరాలకు కొత్త కొండబాబును 9848169790, తోలేటి సూర్యనారాయణను 94903 00606 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

ప్రత్తిపాడు, జూలై 24: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఎంఈవో వి.రాజబాబు చెప్పారు. ధర్మవరం, ఒమ్మంగి, ప్రత్తిపాడు, హైస్కూల్‌లో సంప్రదాయ క్రీడా పోటీలను ఎంఈవో ప్రారంభించారు. సీఆర్పీ రాంజీ ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

నరకం చూస్తున్న వాహనదారులు


తొండంగి: గోపాలపట్నం సమీపంలో ఛిద్రమైన రహదారి

తొండంగి, జూలై 24: మండలంలో ప్రధాన రహదారులు పలుచోట్ల ఛిద్రమవడంతో వాహనదారులు నరకాన్ని చూస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రహదారులపై ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. గోపాలపట్నం సమీపంలో గల అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనదారుల సహనానికి పరీక్షగా మారింది. ఇక్కడ తూతూ మంత్రంగా మరమ్మతులు చేపడుతుండడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారుతోంది. రాత్రివేళ దూర ప్రాంతాల నుంచి ఈ మార్గం గుండా ప్రయాణించే వారికి ఎక్కడ గొయ్యిఉందో తెలియక ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. అద్దరిపేట నుంచి చోడిపల్లిపేట వరకూ గల బీచ్ రోడ్డుపై భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. యల్లయ్యపేట దానవాయిపేట సెంటర్లలో భారీ గోతులు పడడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. గోతులను తక్షణం పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


జగ్గంపేట: అధ్వానంగా ఉన్న రోడ్డు


కిర్లంపూడి: రాజుపాలెం–వీరవరం రహదారి

జగ్గంపేట: జగ్గంపేట, మండలంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. గత వారం నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లలోని గోతుల్లో ద్విచక్రవాహనదారులు, ఆటోలు, కార్లు నడిపే వారికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణం రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కిర్లంపూడి: మండలంలోని వేలంక-సింహాద్రిపురం, రాజుపాలెం-వీరవరం రహదారుల్లో గొయ్యిలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సత్యదేవుడికి కలెక్టర్ ప్రత్యేక పూజలు


కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న రమేష్‌బాబు

అన్నవరం, జూలై 24: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సతీసమేతంగా స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. కలెక్టర్ హోదాలో తొలిసారిగా సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన ఆయనకు డిప్యూటీ కమిషనర్ సత్యదేవుడి చిత్రపటం అందజేశారు.

తగ్గుముఖం పట్టిన సుద్దగడ్డ వరద


వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలు, జూలై 24: సుద్దగడ్డ వరద ఉధృతి బుధవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద జలాలు రావడం తగ్గడంతో నీటి మట్టం తగ్గుతూ వచ్చింది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీ వద్ద రహదారిపై ఇంకా వరద నీరు ప్రవహిస్తున్నది. ఈ నీటిలోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. వరదల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో ఆత్మ విశ్వాసం : డీఈవో


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో

సర్పవరం జంక్షన్, జూలై 24: క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటూ శారీరక ఆరోగ్యం లభిస్తుందని, ప్రాచీన క్రీడల నిర్వహణతో భావితరానికి అవగాహన కల్పించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం పురస్కరించుకుని బుధవారం మూడో రోజు స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7రోజుల పాటు జరిగే శిక్షా సప్తాహ్ కార్యక్రమం జిల్లా అంతటా ప్రభుత్వ హైస్కూల్స్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు నిర్వహిస్తున్న తొక్కుడు బిళ్ల, ఏడు పెంకులాట, కోతి కొమ్మచ్చి, అష్టాచెమ్మా, ఖోఖో, కబడ్డీ క్రీడలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన 250 స్టీలు కంచాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేసేందుకు విద్యార్థుకు ప్లేట్లు అందించిన ప్రిన్సిపాల్ గాయత్రిని అభినందించారు. ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంవో రామారెడ్డి, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల స్వచ్ఛతా వారోత్సవాలు


సామర్లకోట వ్యవసాయ క్షేత్రంలో శుభ్రం చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, అధికారులు

సామర్లకోట, జూలై 24: స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా సామర్లకోట వ్యవసాయ పరిశోధనా క్షేత్రం ఆవరణలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఆధ్వర్యంలో క్షేత్రం అతిథిగృహం ఆవరణలో ఇటీవల పెరిగిన తుప్పలు, పొదలను వ్యవసాయాధికారులు, బయో ఫెర్టిలిటీ ల్యాబ్ వ్యవసాయాధికారులు, ఎస్టీఎల్ వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో కాకినాడ వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్నప్రశాంతి, ఎస్టీఎల్ ఏడీఏ భాస్కరరావు, వ్యవసాయాధికారులు ఐ.సత్య పుణ్యవతి, పవిత్ర, సుధామాధురి పాల్గొన్నారు. వ్యవసాయ పరిశోధనా క్షేత్రం ఆవరణలో జిల్లా స్థాయి వీఏఏలకు శిక్షణా తరగతులు నిర్వహించగా జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, ఏడీఏ రత్న ప్రశాంతి తదితరులున్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరం స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డ్రెయిన్లల్లో పూడిక తొలగించారు. రోడ్లుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని జేసీబీలతో తొలగించారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ చేశారు.

ఏలేశ్వరం: టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, టీడీపీ శ్రేణులు స్థానిక కోనేటి స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, రాయుడు చిన్నా, జొన్నాడ వీరబాబు తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో సూపరింటిండెంట్ సౌమ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా నిర్వహించారు. ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

జగ్గంపేట: జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద డాక్టర్ ప్రణీత ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ చేపట్టారు. వైద్యులు మాధురి, సంధ్య వినూష, భాగ్యలక్ష్మి, తేజ, వైద్య సిబ్బంది ఉన్నారు.

కాకినాడ సిటీ: 36వ డివిజన్‌లో సాలిపేట పాఠశాల ఆవరణలో చెత్తా, చెదారం తొలగించి పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి సుంకర సురేష్, కూటమి నాయకులు నల్లూరి తులసి, ఆకెళ్ల ప్రసాద్, సత్యంశెట్టి రాజేష్, ఉప్పులూరి వీరభద్రరావు, బళ్ల కొండబాబు, పొట్నూరి మహేష్, మిరియాల హైమావతి పాల్గొన్నారు.

'చెరువు గండిని పూడ్చండి'


గండి పడి వృథాగా పోతున్న నీరు

రౌతులపూడి, జూలై 24: శృంగవరం గ్రామంలో తాళ్ల చెరువు గట్టుకు గండిపడింది. దీంతో సాగునీరు వృథాగా పోతుంది. ఇటీవల వర్షాలకు చెరువు నిండా నీరు చేరింది. చెరువు కింద 50 ఎకరాల సాగుభూమి ఉంది. వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్న సమయంలో చెరువు గట్టుకు గండిపడి నీరు పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 3 రోజుల క్రితమే వీర్వో, రైతు భరోసా సిబ్బంది తెలిపినా వారు పట్టించుకోలేదని, ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

'రాధాకృష్ణ అదృశ్యంపై విచారణకు ఆదేశించాలి'


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూలై 24: కాకినాడలోని జిల్లా ఫైలేరియా అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాండ్రేగుల రాధాకృష్ణ అదృశ్యంపై మెజిస్టీరియల్ విచారణ జరిపించాలని ఏపీఎన్జీవోస్ నాయకులు బుధవారం కలెక్టర్‌ను కలిసి కోరారు. ఈ మేరకు అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, జిల్లా మినిస్టీరియల్ అధ్యక్షుడు బి.వీరాజీ, కోశాధికారి రాజా, శివప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్: సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ అదృశ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ ఆఫీసర్‌పై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు జి.రామ్మోహనరావు డిమాండ్ చేశారు. కాకినాడ జీజీహెచ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ ఫైలేరియా విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కాండ్రేగుల రాధాకృష్ణ మెడికల్ ఆఫీసర్ వేధింపులు తాళలేక వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై సమగ్ర మెజిస్టీరియల్ విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రాభివృద్ధికి పుష్కలంగా నిధుల విడుదల

పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి


పిఠాపురంలో మాట్లాడుతున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, జూలై 24: కేంద్రబడ్జెట్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి పుష్కలంగా నిధులు విడుదలయ్యాయని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధుల సాధించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎనలేని కృషి చేశారన్నారు. వైసీపీ పాలనలో ఏనాడు కేంద్రంపై ఒత్తిడి తేవకపోవడంతో నిధులు కేటాయింపు జరగలేదని, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే చంద్రబాబు, పవన్‌లు ఇద్దరూ రాష్ట్రానికి ఏయే పథకాలు నిధులు అవసరమో వివరించి సాధించగలిగారని, రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారని వివరించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయిలో జరిగిన స్కూలు కిట్లు పంపిణీలో మర్రెడ్డి పాల్గొని విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు తదితర వస్తువులతో కూడిన కిట్లును అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్వీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, హెచ్‌ఎం శ్యాంబాబు పాల్గొన్నారు.

చిల్లంగిలో పొలంబడి కార్యక్రమం

కిర్లంపూడి, జూలై 24: చిల్లంగి గ్రామంలో రైతు కంపరపు నాగేశ్వరరావు పొలంలో పొలంబడి కార్యక్రమం ఏవో జోకా అమృత ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు ఆకుల సురేష్, రాజాల అబ్బాయి, రైతులు కాళ్ల భద్రాచలం, కంపరపు నాగేశ్వరరావు, నైదాన రఘు పాల్గొన్నారు.

అయ్యంకి చిత్రపటానికి నివాళి

పెద్దాపురం, జూలై 24: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది సింగం బుల్లియ్య, చింతా సాంబశివరావు, కాటంరాజు పాల్గొన్నారు.

మిషన్‌శక్తిపై అవగాహన

గండేపల్లి, జూలై 24: మండలంలోని మురారిలో బుధవారం మిషన్‌శక్తిపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో కౌన్సిలర్ బి.దుర్గరాణి, సూపర్‌వైజర్ నాగపార్వతి మహిళలు, బాలికల హక్కులపై వివరించారు. జీఎంఎస్‌కె విజయలక్ష్మి, హెచ్‌ఎం అమ్మాజీ ఉన్నారు.

కౌలు రైతుల జాబితా అందజేత

తుని రూరల్, జూలై 24: తుని మండలంలో కౌలు రైతుల జాబితాను ఏరియాలో ఉన్న బ్యాంక్ అధికారులకు అందజేసినట్టు రైతులకు రుణ సదుపాయాలు కల్పించి సాగుకు సహకరించాలని కోరినట్టు ఏవో ఆశోకకుమార్ పేర్కొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

సర్పవరం జంక్షన్, జూలై 24: కాకినాడ రూరల్ తిమ్మాపురం జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా కిట్లను ఇన్‌చార్జి ఎంపీపీ బందిరి విరీష, గ్రామ సర్పంచ్ బి. సత్యనారాయణ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు మాదారపు తాతాజీ అందించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ప్రసాదరావు, జనసేన పార్టీ నాయకులు చోడిశెట్టి ఇంద్ర, బత్తుల దొరబాబు పాల్గొన్నారు.

కోటనందూరు: అల్లిపూడిలో కస్తూరిబా స్కూల్ నందు విద్యార్థులకు టీడీపీ నేతలు బ్యాగ్స్, యూనిఫారమ్ అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట భాస్కర సత్యనారాయణ, అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి.రాజేశ్వరి పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశామని ఎంఈవో బుర్రా వేణుగోపాల్ చెప్పారు. గురువారం ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలకు యూనిఫారాలను పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

కిర్లంపూడి: రామచంద్రపురం ఎంపీ యూపీ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ బండారు ప్రసాద్, హెచ్‌ఎం వీరభద్రరావు, వార్డు మెంబర్లు గంధం రాఘవ, దేవరడి సీత గంధం, చంద్రమ్మ, రేవూరి శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

గండేపల్లి: మండలంలోని ఎన్టీరాజాపురం గ్రామంలో హెచ్‌ఎం ఉండవల్లి భాస్కర్ అధ్యక్షతన సర్పంచ్ బిక్కిన దేవిదుర్గగంగాధర్ ఆధ్వర్యంలో 65మంది విద్యార్థులకు 2 జతల యూనిఫాం, బ్యాగు, బూట్లు, పుస్తకాలు అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ పాలచర్ల సత్యనారాయణ, బిక్కిన వెంకటరావు, పరిమి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరిడమ్మ హుండీల లెక్కింపు

పెద్దాపురం, జూలై 24: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో బుధవారం లెక్కించారు. 31 రోజులకు రూ.11,56,914 ఆదాయం సమకూరినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవాదాయశాఖ అధికారులు చందన, సత్యనారాయణ తదితరులున్నారు.


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'పెండింగ్ నిధులు మంజూరు చేయాలి'

కాకినాడ సిటీ, జూలై 24: కాకినాడ నగర అభివృద్ధికి పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం అమరావతిలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను కోరారు. ఈ మేరకు నగర అభివృద్ధి, స్మార్ట్ సిటీ పెండింగ్ నిధులు మంజూరు తదితర అంశాలపై మంత్రితో మాట్లాడారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

రహదారికి మరమ్మతులు



ప్రత్తిపాడు, జూలై 24: మండలంలో ఉత్తరకంచి రహదారి మరమ్మతులకు గ్రామ సర్పంచ్ వంతెన శ్రీను, జిల్లా టీడీపీ నాయకుడు ఇళ్ళ అప్పారావు తమ సొంత నిధులు వెచ్చించి పనులను బుధవారం వారు ప్రారంభించారు. అరకిలోమీటరు నిర్మాణ పనులు పూర్తి చేశారు. పెద్దిపాలెం వైపు అరకిలోమీటరు పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో శ్రీను, అప్పారావులను పలువురు అభినందించారు.

ముంపు పొలాల పరిశీలన

కరప, జూలై 24: మండలంలోని కొంగోడు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, తదితర గ్రామాల్లో బుధవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ పి.మాధవి, కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావులు పర్యటించి ముంపుకు గురైన పొలాలను పరిశీలించారు. కొంగోడు సర్పంచ్ నక్కా బాబులు, మాజీ ఎంపీటీసీ ఆట్ల గోవిందరాజులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'నాణ్యమైన భోజనమందించాలి'

కాకినాడ సిటీ, జూలై 24: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ కాకినాడ జిల్లా చైర్మన్ వనమాడి మోహనవర్మ సూచించారు. టీడీపీ నాయకులతో కలిసి బుధవారం ఆయన సంజయ్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, టీడీపీ నాయకుడు గాది శివరామకృష్ణ పాల్గొన్నారు.

'వైద్య సిబ్బంది అప్రమత్తంకండి'

జగ్గంపేట, జూలై 24: గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ కోరారు. గ్రామాల్లో జనసైనికులు సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలతో కోఆర్డినేటర్ చేసి ప్రజలకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకుని అవసరమైన మందులు చేరవేయాలని, ఎప్పటికపుడు పరిసరాలు శుభ్రంగా ఉంచేలాచర్యలు తీసుకోవాలన్నారు.

'ప్రయోగశాలను తొలగించాలి'

జేఎన్టీయూకే, జూలై 24: విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అబ్కారీ శాఖ ప్రాంతీయ ప్రయోగశాలను వెంటనే తొలగించాలని జిల్లా ఎస్ఎఫ్ఐ బృందం ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణకు బుధవారం వీసీ ఛాంబర్లో వినతిపత్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గంగాసూరిబాబు, వరహాలు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి!

కొత్తపల్లి, జూలై 24: కొత్తపల్లి ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శ్మశానం, రైతులు చేలల్లోకి వెళ్లే ఈ ప్రధాన రహదారి పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు రైతులు నడవడానికి వీలులేని విధంగా ఈ దారిలో పేరుకుపోయింది.


కొత్తపల్లిలో పేరుకుపోయిన చెత్త

శ్రీ భావనారాయణస్వామి వారి దేవస్థానం

(దేవదాయ ధర్మాదాయశాఖ), సర్పవరం గ్రామం, కాకినాడ(రూ) మండలం, తూ.గో.జిల్లా

భూమి కౌలు హక్కు టెండర్ కమ్ బహిరంగవేలం ప్రకటన

కాకినాడ జిల్లా, సర్పవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భావనారాయణ స్వామివారి దేవస్థానం యొక్క పూర్తి హక్కుభుక్తమైనటువంటి గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం గ్రామములో గల ఈ దిగువ పేర్కొను దాఖలా పల్లం భూమిని సేద్యము చేసుకొనే అనుభవించే హక్కును గూర్చి శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనరు, మల్టీజోన్-1, దేవదాయ ధర్మాదాయశాఖ, రాజమహేంద్రవరం వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ది.30-07-2024 మంగళవారం ఉదయం 11-00 గంటలకు దేవస్థానం వద్ద, [illegible] దేవదాయ ధర్మాదాయశాఖ, కాకినాడ వారి సమక్షమున ఆలయ కార్యనిర్వహణాధికారి వారిచే బహిరంగవేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు పాల్గొనవలసినదిగా తెలియపర్చడమైనది.

ఆంధ్రప్రదేశ్, హిందూ దేవదాయ-ధర్మాదాయశాఖ చట్టము 30/87 [illegible] జి.ఓ.ఎమ్.ఎస్.నెం.425 [illegible] ఎండోమెంట్స్-1 నందు పొందుపర్చిన నిబంధనలు అనుసరించి సదరు భూమి కౌలుకు బహిరంగవేలంపాట జరుపబడును. పాటదారు హిందు మతస్థులై ఉండాలి. మిగిలిన వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు:9290550872, 9704197952.

వ నెం	భూమి ఉన్న గ్రామం & మండలం	సర్వే నెం	భూమి విస్తీర్ణం ఎ.సెం.	భూమి స్వరూపం	పాట ధరావత్తు రూ.లు	[illegible]	కౌలు కాలపరిమితి
1	ఎ.విజయనగరం గొల్లప్రోలు మండలం	486/3 534/1 534/3	2-42 0-95 2-17				2024-25 నుండి 2026-27 వరకు (3సం.లు మాత్రమే)
			5-54	పల్లం	10,000/-	3,00,000/-	

సర్పవరం
ది. 21-7-2024

ఇట్లు:
కార్యనిర్వహణాధికారి